సాక్షి
వనపర్తి
మంగళవారం ၊ 17 ၊ అక్టోబర్ ၊ 2023



సత్తాచాటిన క్రీడాకారులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో క్రీడాకారులు సత్తాచాటారు.

వివరాలు 10లో ▸



బ్రహ్మాండ నాయకి..

అలంపూర్ జోగుళాంబ క్షేత్రంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.9 /20.4

రోజంతా ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమవుతుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు(స్థానిక సంస్థలు) కలెక్టర్ దీపక్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, రేమద్దుల, కిష్టాపూర్, గోప్లాపూర్, అన్నారం, దావాజిపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్లు, ఫర్నీచర్, ర్యాంప్‌లు తదితర వసతులు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా కేంద్రాల్లో ఆయా వసతులు తప్పక ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాంబాయి, ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, డీటీ చక్రపాణి, ఎస్‌ఐ వేణు, ఏపీఓ కుర్మయ్య, ఆర్‌ఐ మహేష్ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓగా జయచంద్ర

వనపర్తి: జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా సోమవారం డాక్టర్ జయచంద్ర బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతల్లో ఇన్‌చార్జి అధికారిగా కొనసాగిన డాక్టర్ రవిశంకర్ నుంచి ఛార్జి తీసుకున్నారు. 1998లో నవాబ్‌పేట పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు ప్రారంభించిన డాక్టర్ జయచంద్ర, నారాయణపేట, చేవెళ్ల, హైదరాబాద్ ప్రాంతాల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. పదోన్నతిపై వనపర్తి జిల్లాకు డీఎంహెచ్‌ఓగా వచ్చారు. నూతన డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జయచంద్రను కార్యాలయ సిబ్బంది శాలువాతో కప్పి ఆహ్వానించారు.

తలోదారి..!

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటనతో భగ్గుమన్న అసంతృప్త జ్వాలలు

- టికెట్ల ప్రకటనపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి
- స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉంటానన్న జగదీశ్వరరావు
- ఫలించని పార్టీ పెద్దల బుజ్జగింపులు



మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో పార్టీ పెద్దలు మాణిక్‌రావు ఠాక్రే, జానారెడ్డి, చిన్నారెడ్డి మంతనాలు

సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ప్రకటన ఆ పార్టీలో ప్రకంపనలు పుట్టిస్తోంది. టికెట్ ఆశించి భంగపడ్డ అసంతృప్త నేతలు పార్టీని వీడేందుకు మొగ్గు చూపుతుండటం ఆ పార్టీ శ్రేణుల్లో కలవరం రేపుతోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకుగానూ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ఖరారు చేసింది. అచ్చంపేట నియోజకవర్గంలో పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న వంశీకృష్ణ బరిలో నిలువనుండగా, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఇటీవల పార్టీలో చేరిన కొత్తవారికి అవకాశం దక్కింది. ఈ నేపథ్యంలో ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తమ విషయంలో పార్టీ నిర్ణయం తీసుకోకపోతే వీడేందుకు సిద్ధమన్న సంకేతాలిచ్చారు.

మలివిడత జాబితాపై సస్పెన్స్..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో కొడంగల్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్‌లో కె.శంకరయ్యను అభ్యర్థులుగా ప్రకటించారు. మిగిలిన నియోజకవర్గాల్లోనూ టికెట్ కోసం పోటీ తీవ్రంగా కన్పిస్తోంది. ప్రధానంగా మక్తల్ నియోజకవర్గంలో వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సీతా దయాకర్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి, నాగరాజుగౌడ్ టికెట్ ఆశిస్తున్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారైనట్టుగా తెలుస్తోంది. అయితే ఇక్కడి నుంచి డీసీసీ మాజీ అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ సైతం టికెట్ కోరుతున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో అనిరుధ్‌రెడ్డికి టికెట్ ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. దేవరకద్ర నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసుదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకుడు కాటం ప్రదీప్‌కుమార్ గౌడ్, కొండా ప్రశాంత్‌రెడ్డి మధ్య పోటీ నెలకొంది. నారాయణపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్, కుంభం శివకుమార్‌రెడ్డి టికెట్ కోసం పోటీపడుతున్నారు. కాంగ్రెస్ ప్రకటించనున్న మలివిడత జాబితాలో అభ్యర్థుల పేర్లు ఖరారయ్యాక ఆయా చోట్ల పరిస్థితి ఎలా ఉంటుందోనన్నది ఉత్కంఠగా మారింది.

ఫలించని పెద్దల బుజ్జగింపులు..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కూచకుళ్ల రాజేశ్‌రెడ్డిని ప్రకటించిన వెంటనే నాగం జనార్దన్‌రెడ్డిని బుజ్జగించేందుకు పార్టీ అధిష్ఠానం రంగంలోకి దిగింది. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ మంత్రులు జానారెడ్డి, చిన్నారెడ్డితో కలిసి సోమవారం హైదరాబాద్‌లోని నాగం ఇంటికి వెళ్లి చర్చించారు. పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు ఇతర పెద్దల దృష్టికి తీసుకెళ్తామని అంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని చెప్పినట్లు తెలిసింది. అనంతరం సోమవారం సాయంత్రం జిల్లాకేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ అధిష్ఠానం తీరుపై నాగం ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అభ్యర్థిగా కూచకుళ్ల కుటుంబానికి ఎలాంటి అర్హత లేదని, తనను ఓటు అడిగే హక్కు వారికి లేదని వ్యాఖ్యానించారు.

తేలేదెవరో.. మునిగేదెవరో

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి, సమయం మించిపోతున్న నేపథ్యంలో పలుచోట్ల కాంగ్రెస్ అభ్యర్థిత్వాలను ప్రకటించినా, టికెట్ ఆశించిన పెద్దనేతలు పార్టీని వీడుతుండటం హస్తం శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఏళ్లుగా పార్టీ కోసం పని చేసిన సీనియర్ నేతలు చివరి నిమిషంలో తమ దారి తాము చూసుకుంటే ఎన్నికల్లో ఎవరికి నష్టం జరుగుతుందో, ఎవరికి మేలు జరుగుతుందోనన్న దిగులు నెలకొంది.

అధిష్ఠానంపై ధిక్కారస్వరం..

అసెంబ్లీ ఎన్నికలకు గడువు దగ్గరపడుతుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా 58 మందితో తొలి విడత అభ్యర్థుల జాబితాను వెలువరించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల అభ్యర్థులకు ఈ జాబితాలో చోటు దక్కింది. పార్టీ అభ్యర్థులను ప్రకటించిన వెంటనే టికెట్ ఆశించిన సీనియర్ నేతలు తమ ధిక్కార స్వరాన్ని విన్పించారు. సోమవారం కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ వేదికగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, సీనియర్ నేత చింతలపల్లి జగదీశ్వరరావు పార్టీ అధిష్ఠానం తీరుపై మండిపడ్డారు. ఏళ్లుగా పార్టీ కోసం శ్రమించిన వారిని కాదని అవకాశవాదులకు టికెట్ ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో స్వతంత్రుడిగానైనా బరిలో ఉంటున్నానని ఆయన తేల్చిచెప్పారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థితో కలిసేది లేదని తేల్చి చెప్పారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సైతం పార్టీ వీడేందుకు సిద్ధమన్న సంకేతాలిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిపై ఆయన నేరుగా విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో పోటీ విషయమై తన అనుచరులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి తేజస్ పవార్, ఆర్‌ఓ తిరుపతిరావు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: రానున్న అసెంబ్లీ ఎన్నికలు జిల్లాలో పారదర్శకంగా నిర్వహించేందుకు ఈసీ ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్‌ఓ, ఎల్‌బీ ఎస్.తిరుపతిరావుతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి తప్పనిసరిగా ఉండాలని, అందుకు సువిధ యాప్‌ను ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై పౌరులు ఫిర్యాదు చేసేందుకు సీ విజిల్ యాప్‌ను తీసుకొచ్చామని, ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో స్పందించి పరిష్కారం చేసేలా ఈ యాప్ పనిచేస్తోందన్నారు. కొత్తగా ఓటుహక్కు కోసం, పోలింగ్ కేంద్రాల మార్పు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఇంకా అవకాశం ఉందన్నారు. మీడియా సంస్థలు ఎన్నికల నిబంధనలకు లోబడి పనిచేయాలని, పెయిడ్ ఆర్టికల్స్‌ను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 40 శాతం కంటే ఎక్కువ వికలత్వం ఉన్న వారికి, 80 ఏళ్ల వయస్సు పైబడిన వారికి 12–డీ ఫారంతో ఇంటి వద్దనే ఓటుహక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇందుకు ఆర్‌ఓ తిరుపతిరావు సారథ్యంలో కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదు తరలిస్తే.. సంబంధిత ఆధారాలుండాలని, లేదంటే సీజ్ చేస్తామన్నారు.

ఖర్చు లెక్కలు పక్కాగా ఉండాలి..

పార్టీలు, అభ్యర్థులకు ప్రత్యేక బ్యాంకు ఖాతాలను ప్రారంభించి ఎన్నికల కోసం చేసిన ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ పవార్ చెప్పారు. సోమవారం మధ్యాహ్నం గుర్తింపు పొందిన ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఈ విషయమై నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో చేస్తున్న ఖర్చుల్లో భాగమైన పార్టీ సమావేశాల ఖర్చులు, డిజిటల్ స్క్రీన్లు, ఫ్లెక్సీల ఏర్పాటు తదితర ఖర్చులు, ఫర్నీచర్, టెంట్ హౌస్ సామగ్రి, మైక్, స్పీకర్స్, ఎన్నికల్లో క్యాంపెయిన్ మెటీరియల్స్‌కు అయ్యే ఖర్చులు, ఎన్నికల ప్రచారంలో ఉపయోగించే వాహనాలకు అయ్యే ఖర్చుల వివరాలను కమిటీ నిర్ణయించిన రేట్లను వివరించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన రేట్ల ఆధారంగా విభాగాల వారీగా వివరించారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారి ఎస్.తిరుపతి రావు, నోడల్ అధికారులు, ఆర్డీఓ పద్మావతి, జిల్లా టాస్క్‌ఫోర్స్, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సోషియల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలు అభ్యర్థులకు ఓటువేయాలంటూ.. ప్రకటనలు పోస్టు చేయాలని, ప్రసారం చేయాలనే అనుమతి విధిగా తీసుకోవాలన్నారు.

అప్పుడు లేని ఆస్తులు ఇప్పుడెలా?



మాట్లాడుతున్న మాజీ ఎంపీ ఏపీ జితేందర్ రెడ్డి

వనపర్తిటౌన్/ పెబ్బేరు రూరల్: బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేలు, మంత్రులు కాకముందు లేని ఆస్తులు నేడు ఎలా వచ్చాయని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్ ప్రశ్నించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్‌లో వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత కార్యకర్తల, బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ హయాంలో దేశం విశ్వగురువుగా రూపుదిద్దుకుంటుందని, జీ 20 సమిట్, మేక్ ఇన్ ఇండియా ద్వారా భారత్‌లోనే తయారీలు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళల బిల్లుల ఆమోదం, చంద్రయాన్ 2 ద్వారా చంద్రుడి సౌత్ పోల్లో అడుగుపెట్టిన ఘనత, ఎయిర్‌పోర్ట్, రైల్వే, జాతీయ రహదారులు తదితర వాటితో ప్రధాన మంత్రి మోదీ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నాడని చెప్పారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలమవుతుందని, జిల్లా పెద్ద ఇండస్ట్రీలతో రైస్ బౌల్‌గా మారనుందని సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. రూ.32 వేల కోట్ల అంచనాలతో ప్రారంభించి నేటికీ దాదాపు రూ.60 వేల కోట్లు ఖర్చు చేశారని, ప్రాజెక్టుకు రూ.25 వేల కోట్లు ఖర్చు కాగా మిగులు నిధులను బీఆర్‌ఎస్ నాయకులు పెద్దనోక్లతో మింగేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ప్రతాప్, రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, బి.కృష్ణ, అశ్వత్థామ రెడ్డి, సర్వేశ్వర్ రెడ్డి, మున్నూరు రవీందర్, జింకల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు



వనపర్తి టౌన్: సెప్టెంబర్ నెల రివార్డ్స్ అండ్ రికగ్నైజేషన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బందికి సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వరరావు ప్రశంసా పత్రాలు అందజేశారు. డిపో మేనేజర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోడ్డు మీద ట్రాఫిక్ రూల్స్ పాటించుకుంటూ ప్రజలకు సుఖవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించాలన్నారు. రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు, సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి పోలీస్ అమరుల సంస్మరణ కార్యక్రమాలు

వనపర్తి: జిల్లాలో పోలీస్ సంస్మరణ కార్యక్రమాలు ఈ నెల 21 నుంచి పదకొండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎస్పీ రక్షితా కె.మూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోలీస్ ఫ్లాగ్ డేతో ప్రారంభమై.. జాతీయ ఐక్యత దినోత్సవం అక్టోబర్ 31న కార్యక్రమాలు ముగుస్తాయన్నారు. ఓపెన్ హౌస్ నిర్వహించి పోలీసుల విధులు, త్యాగాలు, సాంకేతిక వినియోగం, ప్రజల రక్షణలో పోలీసులు చేసిన సేవలను ప్రజలకు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కేటగిరి–1లో కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ స్థాయి అధికారి వరకు పోలీసుల విధులు, పని – జీవిత సమతుల్యత, కేటగిరి–2లో ఎస్‌ఐ ఆ పైస్థాయి అధికారులు.. సమాజంలో లింగ సమానత్వాన్ని కాపాడటంలో పోలీస్ పాత్ర అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో 500 పదాలకు మించకుండా రాసేలా నిర్వహించాలన్నారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో రక్తదాన శిబిరాలు, పోలీస్ అమరవీరులను స్మరిస్తూ.. పోలీస్ సైకిల్ ర్యాలీలతో పాటు షార్ట్‌ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని, మహిళలు, అన్యాయానికి గురైనప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సెంటిమెంట్

బీ ఫాం రాగానే.. గట్టుకాడిపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



గట్టుకాడిపల్లిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

- అక్కడే నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం
- ఈశాన్య గ్రామం సల్కెలాపురం నుంచి ప్రచారం
- సీఎం హుస్నాబాద్ బహిరంగసభ సెంటిమెంట్ మాదిరిగానే ఇక్కడ పాటింపు
- నియోజకవర్గంలోని ప్రతిపక్ష పార్టీలు టికెట్ల లొల్లి నుంచి తేరుకోకముందే.. బీఆర్‌ఎస్ ప్రచారం

వనపర్తి: రాజకీయ నాయకుల్లో చాలా మందికి ఎన్నికలంటే కొన్ని సెంటిమెంట్లు ఉంటాయి. ప్రతిసారి ఎన్నికల సమయంలో ఆ సెంటిమెంట్‌ను పక్కాగా ఫాలో అవుతున్నారు. ఈ తరహాలోనే.. వనపర్తి నియోజకవర్గం నుంచి 2018 ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన ప్రస్తుత మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ.. సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు. ఆదివారం సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీ ఫాం అందుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డి ఆనవాయితీ ప్రకారం సోమవారం ఉదయం నియోజకవర్గం ముఖ్యనాయకులతో కలిసి ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి వారికి రానున్న ఎన్నికల్లో చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు.

ప్రతిపక్షాలు తేరుకోకముందే..

నియోజకవర్గంలోని ప్రతిపక్ష పార్టీలు టికెట్ల లొల్లి నుంచి తేరుకోకముందే.. బీఆర్‌ఎస్ ప్రచారం పేరుతో జనంలోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. నియోజకవర్గంలోని ప్రధాన ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీలో అభ్యర్థుల పేర్లే ఇప్పటికింకా ఖరారు కాలేదు. అధికార పార్టీ అన్ని హంగులతో ఓట్ల వేట కోసం ప్రజల్లోకి వెళ్తుండటం గమనార్హం.

ఈశాన్య గ్రామం నుంచే..

వనపర్తి జిల్లా, నియోజకవర్గానికి ఈశాన్య గ్రామమైన ఖిల్లాఘనపురం మండలంలోని సల్కెలాపురం గ్రామం నుంచే గత ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మంత్రి.. మంగళవారం బీఆర్‌ఎస్ మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. అభివృద్ధి నినాదంతో అట్టహాసంగా ప్రారంభించేందుకు బీఆర్‌ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. మొదటిరోజు సల్కెలాపురం, మామిడిమాడ, పర్వతాపురం గ్రామాల్లో లాంఛనంగా ప్రచారం చేయనున్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. సీఎం గత ఎన్నికల్లో హుస్నాబాద్‌లో మొదటి బహిరంగ సభను ఏర్పాటు చేసి స్వతంత్రంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత బలం దక్కించుకున్నారు. ఈ సారి అదే సెంటిమెంట్ ఫాలో అయ్యారు. అదే తరహాలో 2018 ఎన్నికల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి గట్టుకాడిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అక్కడే నియోజకవర్గం ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించి, సల్కెలాపురం నుంచి ప్రచారం ప్రారంభించారు. గతంలో ఎన్నడూ ఎవ్వరూ ఈ నియోజకవర్గం నుంచి సాధించలేనంత మెజార్టీతో గెలుపొందారు. ఈ సారి ఈ సెంటిమెంట్‌ను మంత్రి ఫాలో అవుతూ.. ఆలయంలో స్వామివారి పాదాల వద్ద బీ ఫారం ఉంచి పూజలు చేశారు.

సాగు, తాగునీటి రాకతో తెలంగాణ సస్యశ్యామలం

ఖిల్లాఘనపురం: సీమాంధ్ర పాలకుల పాలనలో గుక్కెడు నీటి కోసం ఏడ్చి, అవస్థలు పడిన ప్రజలకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో సాగు, తాగునీరు పుష్కలంగా రావడంతో రాష్ట్రం మొత్తం పచ్చటి పంటలతో సస్యశ్యామలం అయ్యిందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నుంచి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్న సందర్భంగా ఆయన సోమవారం నేరుగా ఇష్టదైవం ఖిల్లాఘనపురం మండలం గట్టుకాడిపల్లిలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం వెలుపల నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 70 సంవత్సరాల పాటు ఎదుర్కొన్న అవస్థలను తొలిగించేందుకు పునర్నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. 10 సంవత్సరాలుగా తెలంగాణ ప్రజల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. త్వరలో జరిగే శాసనసభ ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్‌ఎస్ నాయకులు 41 రోజుల పాటు మండల దీక్షలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యులు సామ్యానాయక్, రాళ్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

డబ్బే.. డబ్బు

వివిధ ప్రాంతాల్లో భారీగా నగదు పట్టివేత

- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా తనిఖీలు
- పలుచోట్ల మద్యం సైతం స్వాధీనం



దేవరకద్రలో కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం/ వనపర్తి/ మక్తల్/ చిన్నచింతకుంట/ దేవరకద్ర రూరల్/ మద్దూరు/ మరికల్/ దామరగిద్ద/ తెలకపల్లి/ పెబ్బేరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించి రూ.1,11,96,570 నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధితోపాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం ఒక్కరోజే మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.99,61,370 నగదు సీజ్ చేశారు. ఇందులో మహబూబ్‌నగర్ వన్‌టౌన్ సీఐ సైదులు ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ ఏరియాలో తనిఖీలు జరపగా ద్విచక్రవాహనంపై బ్యాగ్‌లో ఉదయ్‌కుమార్, రవికుమార్ అనే ఇద్దరు వ్యక్తులు రూ.28,73,000 తీసుకెళ్తుండగా పట్టుకున్నారు. నగదుకు సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో సీజ్ చేశారు. అలాగే రూరల్ సర్కిల్ పరిధిలో మొత్తం రూ.18,26,670, చిన్నచింతకుంట పోలీసులు లాల్‌కోట చౌరస్తాలో రూ.35,49,900, దేవరకద్ర పోలీసులు రూ.17,11,800 నగదు స్వాధీనం చేసుకుని కమిటీకి అప్పగించనున్నారు. అలాగే టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి సంజయ్‌నగర్, కొత్త చెరువు రోడ్, హనుమాన్‌నగర్ ఏరియాల్లో బెల్టు దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా నలుగురి ఇళ్లలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తుండగా 60 లీటర్ల లిక్కర్ సీజ్ చేయడంతోపాటు వారిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

■ నారాయణపేట జిల్లా మద్దూరులోని ఓ సినిమా థియేటర్ దగ్గర కారును తనిఖీ చేయగా దామరగిద్ద మండలాలనికి చెందిన అయ్యవారిపల్లి బాల్‌రెడ్డి, దూదేపల్లికి చెందిన వ్యక్తి వాహనంలో రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి కమిటీకి అప్పగిస్తామని కోస్గి సీఐ జనార్దన్ తెలిపారు. మరికల్‌లోని ఆత్మకూర్ ఎక్స్ రోడ్డులో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా మహబూబ్‌నగర్ నుంచి నర్వ వెళ్తున్న వెంకటరాజు కారులో రూ.3 లక్షలు, దేవరకద్ర నుంచి రాయిచూర్ వెళ్తున్న శ్రీశైలం కారులో రూ.50,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. అలాగే ఎలిగండ్లకు చెందిన శేఖర్‌గౌడ్ రూ.19 వేల విలువ గల మద్యం ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామన్నారు.

■ మక్తల్ సీఐ రాంలాల్, ఎస్‌ఐ పర్వతాలు మండలంలోని చందాపూర్ శివారులో వాహనాల తనిఖీ చేపట్టగా రవికుమార్ అనే వ్యక్తి కారులో రూ.2 లక్షలు, ఎదిర కిరణ్‌కుమార్‌కు చెందిన కారులో రూ.1.29 లక్షలు పట్టుకున్నట్లు చెప్పారు. దామరగిద్ద మండలంలోని కాన్‌కుర్తి చెక్‌పోస్టు దగ్గర పోలీసులు చేపట్టిన తనిఖీల్లో కర్ణాటక రాష్ట్రం కలబురిగి జిల్లా మోదేపల్లికి చెందిన వ్యాపారి రంజిత్‌కుమార్ నుంచి రూ.1.57 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు చెప్పారు. అలాగే మరికల్‌కు చెందిన వ్యాపారి రాజు నుంచి రూ.1.85 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

■ వనపర్తి జిల్లా పరిధిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.1.93 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ రక్షితాకె.మూర్తి తెలిపారు. అలాగే ఆత్మకూరు, రేవల్లి, పెబ్బేరు, గోపాల్‌పేట, వనపర్తి టౌన్ ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలో నిల్వ చేసిన 191 లీటర్ల మద్యంను సీజ్ చేశామన్నారు. శ్రీరంగాపురం మండలంలోని నాగరాలలో బెల్టు షాపుపై దాడి చేసి 11 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటస్వామి చెప్పారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలో నిర్వహించిన తనిఖీల్లో దాసుపల్లికి చెందిన జంగిరెడ్డి అనే వ్యక్తి నుంచి రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వస్రుంనాయక్ తెలిపారు. ఇందుకు సంబంధించి పత్రాలు చూపించి తీసుకెళ్లాలని సూచించామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూర్: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గద్వాల రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని దేవరపల్లికి చెందిన గొల్ల మొగిలయ్య(43) వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయలుదేరాడు. పొలం సమీపంలోని రైలు పట్టాలు దాటుతుండగా రాత్రి 11:45 గంటలకు వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయాన్ని ఉదయం గమనించిన గ్రామస్తులు కుటుంబసభ్యులకు, రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడు..

జడ్చర్ల: బైక్ నడుపుతున్న ఓ వ్యక్తి అకస్మికంగా అదుపుతప్పి కిందపడి మృతి చెందిన ఘటన సోమవారం స్థానిక శంకరాయపల్లి గేటు సమీపంలో చోటు చేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపూర్ మండలం ఖానాపూర్ చెందిన కరీంఖాన్(32) బైక్‌పై మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు వస్తుండగా శంకరాయపల్లిగేటు వద్ద అదుపు తప్పి కింద పడి మృతి చెందాడు. కాగా ఈయన కుటుంబసభ్యులలో ఇద్దరు సోదరులు గుండెపోటుతో మృతి చెందడంతో ఇతను కూడా అకస్మికంగా గుండెపోటుకు గురై మృతి చెంది ఉంటాడని అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,250, సమాంతర కాల్వ ద్వారా 900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 1,250, కుడి కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా ఫేజ్-2 ద్వారా 855 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

ఇంటర్నేషనల్ బ్రిక్స్ గేమ్స్ బీచ్ వాలీబాల్ కోచ్‌గా జమీలుద్దీన్



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రానికి చెందిన సౌత్ సెంట్రల్ రైల్వే వాలీబాల్ కోచ్ సయ్యద్ జమీలుద్దీన్ ఇంటర్నేషనల్ బ్రిక్స్ గేమ్స్‌కు కోచ్‌గా ఎంపికయ్యారు. సౌతాఫ్రికా దేశం దర్బన్‌లో ఈనెల 18 నుంచి 21 వరకు నిర్వహించే బ్రిక్స్ గేమ్స్‌లో పాల్గొనే అండర్-21 ఇండియన్ బీచ్ వాలీబాల్ జట్టుకు ఈయన కోచ్‌గా వ్యవహరించనున్నారు.

నేషనల్ గేమ్స్ నెట్‌బాల్ పోటీలకు అఫీషియల్స్‌గా జిల్లావాసులు



విక్రం ఆదిత్యరెడ్డి



ఖాజాఖాన్

మహబూబ్‌నగర్ క్రీడలు: గోవా రాష్ట్రం పంజింలో ఈనెల 22 నుంచి 27 వరకు నిర్వహించే 37వ నేషనల్ గేమ్స్‌లో నెట్‌బాల్ పోటీలకు అఫీషియల్స్‌గా జిల్లావాసులు నియమితులయ్యారు. తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి నెట్‌బాల్ పోటీల టెక్నికల్ కమిటీ కన్వీనర్‌గా, ప్రధాన కార్యదర్శి ఖాజా ఖాన్ జ్యూరీ సభ్యుడిగా నియామకం అయ్యారు. వీరిని నియామకం చేస్తూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది.

రేషన్‌షాపులో ప్లాస్టిక్ బియ్యం



కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో సోమవారం ఉదయం రేషన్‌షాపులో ప్రజలు తీసుకున్న బియ్యంలో ప్లాస్టిక్ బియ్యం వచ్చాయని గ్రామస్తులు ఆరోపించారు. కొందరు ఆ బియ్యాన్ని ఉడకబెట్టగా అవి ఎంతకు ఉడకకపోవడంతో ముమ్మాటికి ప్లాస్టిక్ బియ్యంగా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తాము డీలర్‌ను అడుగగా తనకు ప్రభుత్వం అందించిన వాటినే ఇస్తున్నానని, ఈ విషయం తనకు తెలియదని అన్నారు. పేదలకు అందించే ప్రభుత్వ బియ్యం కల్తీ కావడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రహ్మాండ నాయకి.. నమో నమః

- బ్రహ్మచారిణిగా జోగుళాంబదేవి
- వైభవంగా సాగుతున్న బ్రహ్మోత్సవాలు



చిన్నారుల నృత్య ప్రదర్శన



జోగుళాంబ ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: ఐదో శక్తిపీఠం అలంపురం జోగుళాంబ క్షేత్రంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం అమ్మవారు బ్రహ్మచారిణిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో అమ్మవారి శ్రీచక్రానికి భక్తులు కుంకుమార్చన, లలిత, విష్ణుసహస్రనామ పారాయణం నిర్వహించారు. వేదపండితులు సప్తశతి, పంచదశి పారాయణం చేశారు. అదేవిధంగా వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులు ఆలయంలో నృత్యాలు చేశారు.

అమ్మవారికి పల్లకీసేవ..

జోగుళాంబ ఉత్సవమూర్తికి పల్లకీసేవ నిర్వహించారు. అమ్మవారి దీక్ష చేపట్టిన 56మంది భక్తులు అమ్మవారిని ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మరింత ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

జోగుళాంబను దర్శించుకున్న ఎమ్మెల్సీ..

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఎమ్మెల్సీ ఏపీఎస్ రెడ్డి దర్శించుకున్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి ఆర్భాటం లేకుండా సామాన్యులతో పాటు ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అలరించిన నృత్య ప్రదర్శన..

తాడిపత్రి నుంచి వచ్చిన వందన డాన్స్ అకాడమీ చిన్నారులు కూచిపుడి, భరతనాట్యంతో పాటు మహిషాసుర మర్దిని వేషధారణతో నృత్యం చేశారు. అలనాటి పురాణ గాథలను కళ్లకు కట్టినట్లు చూపుతూ చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ అలరింపజేశాయి. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు నృత్య నాట్యాచార్యులు వందనతో పాటుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

మన్యంకొండలో నవరాత్రి వేడుకలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం దేవస్థానంలో పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొండపై నున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంతో పాటు దిగువ కొండవద్దనున్న అలివేలు మంగతాయారు దేవస్థానంలో ఈ పర్వదిన వేడుకలను నిర్వహిస్తున్నారు.

భక్తుల సందడి

నవరాత్రి వేడుకల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు మన్యంకొండకు సోమవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. పాఠశాలలకు దసరా పండుగ సెలవులు ఉండటంతో భక్తుల సందడి నెలకొంది. కొంతమంది భక్తులు స్వామివారికి దాసంగాలను సమర్పించారు.



అలంకరణలో అలివేలు మంగతాయారు అమ్మవారు

యువత జీవితంలో ఆదర్శంగా రాణించాలి



ప్రసంగిస్తున్న పాస్టర్ సామ్యూల్

స్టేషన్ మహబూబ్‌నగర్: యువత జీవితంలో ఆదర్శంగా రాణించాలని మిరాకల్ మినిస్ట్రీస్ నిర్వాహకుడు, అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకుడు పాస్టర్ సామ్యూల్ కర్మోజీ అన్నారు. రెమా వర్షిప్ సెంటర్ డైరెక్టర్ రెవ.పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన సోమవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం నుంచి సాయంత్రం వరకు యూత్ రీ-టర్న్ మెగా ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాస్టర్ సామ్యూల్ హాజరై ప్రసంగించారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువత దురలవాట్లకులోనై తమ జీవితాలను అధోగతి పాలు చేసుకుంటున్నారని అన్నారు. మనల్ని సృష్టించిన దేవుడు మనకు కావాల్సినవి అనుగ్రహించేందుకు సిద్ధంగా ఉన్నాడన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలన్నారు. మనమంతా ప్రతి రోజు దేవునిపై విశ్వాసంగా ఉంటూ రాణించినట్లయితే మన జీవితాల్లో గొప్ప వెలుగుల్ని చూస్తామన్నారు. పెడదారిన వెళ్తున్న యువతను దేవుని వైపు మళ్లించి వారి జీవితాల్లో నూతన వెలుగుల్ని తీసుకొచ్చేందుకు 20ఏళ్లుగా యూత్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు.

ఆకట్టుకున్న వర్షిప్ టీం..

విజయవాడకు చెందిన వన్‌నెస్ వర్షిప్ టీం సుమారు మూడు గంటల పాటు నిర్వహించిన వర్షిప్ కార్యక్రమం యువతను ఆకట్టుకుంది. కార్యక్రమంలో రెమా వర్షిప్ డైరెక్టర్ బీఎస్.పరంజ్యోతి, వేదాంతి, తిమోతి, శ్యామ్ సుందర్, సామ్యూల్, నాగరాజు, జయపాల్, సన్ని, అనిల్, యువత పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సమావేశం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు జెడ్పీ మీటింగ్‌హాల్‌లో నిర్వహించనున్నారు. సభ్యులు హాజరై గతంలో చేపట్టిన పనులపై కేవలం సమీక్షించనున్నట్లు తెలుస్తుంది. ఈ సమావేశంతో మరో రెండు సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఉన్న పాలక మండలి ఈ ఏడాది జులై 5వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తి చేసుకున్నది. ఇప్పటి దాక జెడ్పీకి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.9.31 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇందులో 2020-21 నుంచి ఇప్పటి దాకా రూ.7.12 కోట్ల నిధులు విడుదలయ్యాయి. దీంతో 235 పనులు చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2.19 కోట్లు మంజూరు కాగా, 84 పనులు చేపట్టాలని ప్రతిపాదించారు.

సత్తాచాటిన క్రీడాకారులు





నారాయణపేట కలెక్టర్‌తో ఓరల్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న క్రీడాకారులు, మరికల్‌లో బాయ్‌బాయ్ మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

మరికల్: మూడు జిల్లాలకు సంబంధించిన 9వ జోనల్ స్పోర్ట్స్ మీట్ క్రీడా సంగ్రామం సోమవారం ముగియడంతో విజేతలు కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా బహుమతులను అందుకున్నారు. అంతకుముందు క్రీడాకారులు కలెక్టర్‌కు బాయ్ బాయ్ చెబుతూ మార్చ్‌ఫాస్ట్ చేశారు.

జీవితంలో క్రీడలు ఎంతో ముఖ్యం

సమాజంలో ప్రతి విద్యార్థికి చదువులతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని కలెక్టర్ అన్నారు. మరికల్‌లో 4 రోజులుగా నిర్వహించిన 9వ జోనల్ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసగించారు. ఇలాంటి క్రీడలు నిర్వహించినప్పుడు విద్యార్థుల్లో పోటీతత్వం ఉంటేనే భవిష్యత్‌లో రాణిస్తారన్నారు. ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా ఓటమికి గల కారణాలను అన్వేషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ ఫ్లోరెన్స్‌రాణి, డీసీఓ దేవసేన, ప్రిన్సిపాల్ అనురాధ, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

- అండర్-14లో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఆర్‌గూడెం, ఓరల్ చాంపియన్‌షిప్ మక్తల్, గేమ్స్ ఓరల్ చాంపియన్‌షిప్ ఆర్‌ఆర్‌గూడెం, గేమ్స్ స్పోర్ట్స్ ఓరల్ చాంపియన్‌షిప్ మక్తల్.
- అండర్-17లో అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ నస్‌చర్ల, ఓరల్ చాంపియన్‌షిప్ నస్‌చర్ల, గేమ్స్ చాంపియన్‌షిప్ నారాయణపేట, గేమ్స్ స్పోర్ట్ ఓరల్ చాంపియన్‌షిప్ నారాయణపేట.
- అండర్-19లో అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ నస్‌చర్ల, ఓరల్ చాంపియన్‌షిప్ నస్‌చర్ల, గేమ్స్ ఓరల్ చాంపియన్‌షిప్ మరికల్ నిలిచాయి.

ముగిసిన గురుకుల జోనల్ గేమ్స్

- నాలుగు రోజులు కొనసాగిన ఆటలపోటీలు
- విద్యార్థులకు బహుమతులు అందించిన అధికారులు



అండర్-17 కబడ్డీలో మొదటిస్థానంలో నిలిచిన కొల్లాపూర్ జట్టుకు బహుమతి అందిస్తున్న సీఐ మహేశ్వర్‌రావు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

గోపాల్‌పేట: ఈనెల 13న మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాల వద్ద ప్రారంభమైన జోనల్ గేమ్స్ సోమవారంతో ముగిశాయి. ఎనిమిది గురుకుల పాఠశాలలకు చెందిన 680 మంది విద్యార్థులు పాల్గొనగా 200 మంది టీచర్లు వారిని గైడ్ చేశారు. ఆటల పోటీల్లో అథ్లెటిక్స్, అండర్-14, 17, 19లలో కబడ్డీ, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాల్ బ్యాట్మింటన్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కబడ్డీలో తెలకపల్లి మొదటిస్థానంలో నిలవగా, కొత్తకోట రెండో స్థానంలో నిలిచింది. అండర్-14, 17, 19 ఖోఖో పోటీల్లో ఓవర్ఆల్ చాంపియన్‌షిప్‌గా గోపాల్‌పేట మండలం బుద్దారం గురుకుల విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచారు. అలాగే అథ్లెటిక్స్‌లో సైతం గోపాల్‌పేట మండలం బుద్దారం గురుకుల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. హ్యాండ్‌బాల్‌లో బుద్దారం గురుకుల పాఠశాల మొదటిస్థానంలో నిలవగా, కొత్తకోట రెండో స్థానంలో నిలిచింది. బాల్ బ్యాట్మింటన్‌లో మన్ననూరు మొదటి స్థానంలో నిలువగా బుద్దారం గురుకుల పాఠశాల రెండోస్థానంలో నిలిచింది. వాలీబాల్‌లో మన్ననూరు మొదటిస్థానం, కొత్తకోట రెండోస్థానంలో నిలిచాయి. గెలుపొందిన వారికి వనపర్తి సీఐ మహేశ్వర్‌రావు, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరోగ్యం, డీవైఎస్‌ఓ సురేందర్‌రెడ్డి, ఆర్‌సీఓ వనజ, డీసీఓ రవీందర్, ఆర్‌ఎస్‌సీ (పీడీ) భాస్కర్‌గౌడ్, పీఈటీలు లక్ష్మి, లావణ్య, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అచ్చంపేటలో విజేతలకు బహుమతులు అందిస్తున్న జడ్జి విజయ్‌కుమార్

అచ్చంపేట రూరల్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా కొనసాగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు సమావేశానికి సివిల్ కోర్టు జడ్జి విజయ్‌కుమార్ హాజరయ్యారు.

విజేతలు వీరే..

వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వాలీబాల్ అండర్-17లో అచ్చంపేట, 19లో మదనాపురం, కబడ్డీ అండర్-17లో జేపీ నగర్, 19లో లింగాల, 14లో మదనాపురం, హ్యాండ్‌బాల్ అండర్ -17లో జేపీ నగర్, 19లో బాలానగర్, బాల్ బ్యాడ్మింటన్ అండర్-17లో ఇటిక్యాల, 19లో లింగాల మొదటి స్థానంలో నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో అండర్-14, 17లో జేపీనగర్, అండర్-19లో లింగాల నిలిచింది. కార్యక్రమంలో డీఐఈఓ వెంకటరమణ, డీవైఎస్‌ఓ సీతారాం, ఎఫ్‌డీఓ తిర్మల్‌రావు, సీవీఎస్‌ఓ హుస్సేన్, ప్రిన్సిపాల్ రాములు, వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ఆర్‌ఎస్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, పీడీ షంషీర్‌అలీ, లెక్చరర్లు రవిశంకర్‌శెట్టి, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల ఘర్షణ

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



ఎస్‌ఐ చాంబర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ మండలం బొందపల్లిలో నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో టీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేయగా.. మరుసటి రోజు పోలీస్ స్టేషన్‌కు రావాలని గ్రామానికి చెందిన నలుగురు కాంగ్రెస్ కార్యకర్తలకు పోలీసులు తెలియజేశారు. ఇదిలా ఉండగా తెల్లవారుజామునే పోలీసులు గ్రామానికి వెళ్లి నలుగురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న రాజేష్‌రెడ్డి ఉదయాన్నే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి సైతం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాదాపు 3 గంటల పాటు స్టేషన్‌లోనే ఉన్నారు. కార్యకర్తలు తప్పుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చేయిచేసుకోవద్దని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. అయితే సదరు వ్యక్తులను పోలీసులు చట్టపరంగా కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. అనంతరం కూచుకుళ్ల మీడియాతో మాట్లాడారు. తన కార్యకర్తలకు అండగా ఉండేందుకే పోలీస్‌స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు మాట్లాడారు. ఇటు బీఆర్‌ఎస్ నాయకులు సైతం తమ కార్యకర్తపై దాడి చేయడం ఇది మొదటిసారి కాదని, గతంలోనూ ఎన్నికల సమయంలో ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డికి మరోమారు ఫిర్యాదు చేశారు. ఈ కేసు విషయమై సీఐ వివరించారు. రామకృష్ణారెడ్డి అనే వ్యక్తిపై బాలీశ్వర్‌రెడ్డి, హరీశ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డి అనే నలుగురు దాడి చేయగా.. ఇందులో ప్రభాకర్‌రెడ్డి, మాధవరెడ్డిపై గతంలోనూ కేసులు ఉన్నందున రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మిగతా ఇద్దరికి 41ఏ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

ప్రజల జీవన విధానంపై అధ్యయనం చేయాలి



ఏఎస్‌ఓలతో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

కలెక్టర్ పి.ఉదయ్ కుమార్

నాగర్‌కర్నూల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై అధ్యయనం చేయాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వ ఏఎస్‌ఓలకు సూచించారు. సోమవారం 25 మంది కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నుంచి శిక్షణ నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన ఏఎస్‌ఓ లతో వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో కలెక్టర్ ఉదయ్ కుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఏఎస్‌ఓలు 5 రోజుల పర్యటనలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించాలని, రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు ఎలా ఉన్నాయో, ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని, వాటన్నిటిని డేటా రూపంలో సేకరించాలని అన్నారు. ప్రతి గ్రామంలో హరితహారం కింద నర్సరీలను ఏర్పాటు చేశామని, శ్మశానవాటికలు, పల్లె ప్రకృతి వనాలు, ప్రతి గ్రామానికి ట్రాక్టర్, డంపింగ్ యార్డ్ వంటివి ఏర్పాటు చేశామని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు ఎలా ఉన్నాయో చూడాలన్నారు. ముఖ్యంగా తాగునీటి కల్పనకు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతు బీమా పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజల ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయాలన్నారు.

- గ్రామస్థాయిలో సుమారు 40 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వారందరితో అన్ని వివరాలు తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ నిమిత్తం వచ్చిన ఏఎస్‌ఓలకు ఐదు గ్రూపులుగా విభజించి నాగర్‌కర్నూల్, తాడూర్, తెలకపల్లి, కల్వకుర్తి నాలుగు మండలాలను కేటాయించి ఒక్కో ఏఎస్‌ఓకు ఒక ఇన్‌చార్జ్ అధికారితో పాటు, వారికి అవసరమైన సమాచారం ఇవ్వడం జరుగుతుందని వివరించారు.
- నేటి నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు ఐదు రోజుల పాటు గ్రామీణ ప్రాంత ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఢిల్లీ కేంద్ర సచివాలయానికి సంబంధించిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు గ్రామీణ ప్రాంత అధ్యయనంలో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీపీఓ కృష్ణ, మహబూబ్‌నగర్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ గోపాల్, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసులు ఉన్నారు.

కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు



కురుమూర్తి స్వామి హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం అమ్మాపురం కురుమూర్తి స్వామికి భక్తులు అమవాస్య, శని సోమవారాలను పురస్కరించుకొని సమర్పించిన కానుల హుండీని సోమవారం అధికారులు లెక్కించారు. స్వామివారి హుండీ ఆదాయం రూ2,45,779 వచ్చినట్లు ఆలయ ఈఓ మధనేశ్వరెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సన్నాయిల నాగరాజు, వెంకటేశ్వరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సేవా సమితి సిబ్బంది, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాయింట్ వీల్స్, ఎగ్జిబిషన్‌కు రూ.18.80 లక్షల వేలం

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద జాయింట్ వీల్స్ మరియూ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు, తలనీలాలు సేకరించేందుకు, తడకలు, వెదురు బొంగులు సప్లయ్ చేసేందుకు అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో జాయింట్ వీల్స్ మరియూ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు గుంటూరుకు చెందిన సత్యనారాయణ రూ.18.80 లక్షలకు దక్కించుకున్నాడు. తలనీలాలు, తడకలు, వెదురుబొంగుల సప్లయ్‌కి సరైన పాట రానందున వాయిదా వేశామని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మధనేశ్వరెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఎం.నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ యాదవ్, శేఖర్‌రెడ్డి, నాగరాజు, సిబ్బంది శ్రీకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



బోయిన్‌పల్లిలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మిడ్జిల్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం చేకూరుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేస్తూ అలంపూర్ నుంచి నుంచి చేపట్టిన పాదయాత్ర సోమవారం మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లికి చేరింది. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ తాము ఏ పార్టీకి అనుకూలం కాదని, ఎస్సీ వర్గీకరణే ముఖ్యమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎమ్మార్పీఎస్ కేసీఆర్‌కు అండగా నిలిచిందని, మంత్రి వర్గంలో ఎస్సీలకు చోటు కల్పించకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన మాదిగలకు మంత్రి పదవి ఇవ్వలేదని, ఇతర కులాల వారు మొదటిసారి గెలిస్తే మంత్రి పదవి కట్టబెట్టారని విమర్శించారు. తాము ఉద్యమాలు చేయడం వల్ల ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం కమిషన్ వేసి నివేదికలు తెప్పించుకున్నా నేటి వరకు బిల్లుకు ఆమోదం తెలుపక పోవడం బాధాకరమని అన్నారు. నవంబర్‌లో నిర్వహించనున్న పార్లమెంట్ సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించాలని కోరారు.